ప్రజాశక్తి

శనివారం 11 నవంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పాత అనుమతులతో కొత్త పైపులైన్ ?



కొనసాగుతున్న పైపులైన్ పనులు

- ఎలైన్‌మెంట్ మార్చినట్లు హెటిరో ప్రచారం
- ప్రభుత్వ అటవీ భూమిలో నిర్మాణ పనులు
- సమాచారం లేదని అధికారులు మౌనం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, నక్కపల్లి విలేకరి

హెటిరో డ్రగ్స్ కంపెనీ గతం కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన పైపులైన్‌ను నక్కపల్లి పరిధిలోని సముద్రంలోకి వేస్తోంది. పైపులైన్ సామర్థ్యానికి తగిన రసాయనాలను సముద్రంలోకి విడిచిపెడితే మత్స్యకారుల చేపల వేటపై మరింత ఎక్కువ ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. రెండో పైపులైన్ సామర్థ్యానికి తగినట్లు సముద్రం లోపలకు రెండు కిలోమీటర్ల మేర రసాయనాలు విడిచిపెడితే దాదాపు మత్స్యకారుల జీవనోపాధి పూర్తిగా పోతుందని అంటున్నారు. రెండో పైపులైన్ ఏర్పాటుకు హెటిరో యాజమాన్యం 2021 నవంబరు 15న కాలుష్య నియంత్రణ మండలికి దరఖాస్తు చేసుకోవడంతో ఆ శాఖ ఎన్ఒసి జారీ చేసింది. మొదటి పైపులైన్ వ్యాసార్థం 200 మిల్లీమీటర్లు కాగా దీని స్థానంలో 500 మిల్లీమీటర్ల వ్యాసార్థం కలిగిన కొత్త పైపులైన్‌ను హెటిరో యాజమాన్యం వేస్తోంది. అధికారిక సమాచారం ప్రకారం కొత్త పైపులైన్ ద్వారా రోజుకు 12,366 కెఎల్ (కోటీ 23 లక్షల 66 వేల లీటర్లు)ను సముద్రంలోకి విడిచిపెట్టవచ్చు. ఈ సామర్థ్యం కలిగిన పైపులైన్ వేయడం వెనుక భవిష్యత్తులో కంపెనీ ఉత్పత్తి సామర్థ్యాన్ని యాజమాన్యం పెంచడాకేనని తెలుస్తోంది. వాస్తవానికి హెటిరో కంపెనీ ఆరంభంలో దాని ఉత్పత్తి సామర్థ్యం 120 టిపిఎం కాగా 2022 జనవరి నాటికి 853 టిపిఎంకు పెరిగింది. దీంతో నీటి వినియోగం 485 కెఎల్‌డి నుంచి 2022 జనవరి నాటికి 1315 కెఎల్‌డికి పెరిగింది. శుద్ధిచేసి సముద్రంలోకి వదులుతున్న నీరు 365 కెఎల్‌డి నుంచి 535 కెఎల్‌డికి పెరిగింది. ప్రమాదకర వ్యర్థాలు 7.89 టిపిడి నుంచి 41.2989కు పెరిగాయి.

ఇదిలా వుండగా ప్రస్తుతం వేస్తున్న రెండో పైప్‌లైన్ ఎలైన్‌మెంట్ మారినట్లు చెబుతున్న కంపెనీ ప్రతినిధులు నూతన ప్రతిపాదనలతో కాలుష్య నియంత్రణ మండలికి ఎప్పుడు దరఖాస్తు చేసింది ? కాలుష్య నియంత్రణ మండలి పైప్‌లైన్ నిర్మాణానికి ఎప్పుడు అనుమతులు ఇచ్చింది ? అన్న విషయాలను రహస్యంగా ఉంచుతున్నారు. పాత మిగతా 2లో..



అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ..

వామపక్షాల నిరసనలు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఖండిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అమెరికా సామ్రాజ్యవాద కుట్రలను నాయకులు తెలియజేశారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఆక్రమణ దాడిని తక్షణమే నిలుపుదల చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. తాజా యుద్ధాన్ని ఖండిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మానవహారం చేపట్టాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ పాలస్తీనా భూ భాగాన్ని ఇప్పటికే ఇజ్రాయిల్ ఆక్రమించిందని, మిగిలిన గాజా, వెస్ట్‌బ్యాంక్‌ను సైతం ఆక్రమించుకునేందుకు అమెరికా ప్రోద్బలంతో బాంబుల దాడికి దిగడం సరైందికాదని అన్నారు. చమురు నిక్షేపాలను తమ సొంతం చేసుకునేందుకు అమెరికా ఇజ్రాయిల్‌ను సృష్టించి తమ చెప్పుచేతుల్లో పెట్టుకొని పాలస్తీనా ప్రజలపై 50 ఏళ్లకు పైగా దాడి చేస్తునే ఉందన్నారు. ఆ దాడిని ప్రపంచమంతా ఖండిస్తున్నా భారత ప్రధాని యుద్ధోన్మాదుల పక్షాన మద్దతుగా నిలవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. తక్షణమే యుద్ధం ఆపకపోతే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు భారీగా పెరగడంతో పాటు పర్యావరణ పరిణామాలు తీవ్రంగా పెరిగి ప్రపంచ దేశాలకే పెనుముప్పు ఏర్పడుతుందన్నారు. తక్షణమే ఐరాస జోక్యం చేసుకొని యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మిగతా 2లో..

విశాఖకు మరింత ఉజ్వల భవిష్యత్తు

వార్త 2లో..

బాలికను వేధించిన వ్యక్తికి పాతికేళ్ల జైలు

వార్త 3లో..

చెకుముకి సైన్స్ పోటీలకు స్పందన

వార్త 4లో..

36 మంది ఎస్ఐల బదిలీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 36 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో టూ టౌన్, త్రీ టౌన్, ఆనందపురం, ఆరిలోవ, పద్మనాభం, సిటీ విఆర్, కంచరపాలెం, వన్ టౌన్, ఎయిర్‌పోర్టు, పిఎం.పాలెం, ఎంవిపి.కాలనీ, ద్వారకా నగర్, మహారాణిపేట, గాజువాక, గోపాలపట్నం, న్యూ పోర్టు, స్టీల్ ప్లాంట్, పెందుర్తి, మల్కాపురం, దిశా మహిళా పోలీస్ స్టేషన్, సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్లలో ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ విభాగాలలో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, రానున్న సంవత్సరం సాధారణ ఎన్నికలతో పాటు పలు అంతర్జాతీయ కార్యక్రమాలను నగరంలో నిర్వహించనున్నందున పనితీరు, ప్రతిభ ఆధారంగా ఈ సాధారణ బదిలీలు నిర్వహించినట్టు సిపి తెలిపారు.

ముగిసిన భారత్, బంగ్లా ద్వైపాక్షిక విన్యాసాలు



విన్యాసాల్లో పాల్గొన్న నౌక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత్ - బంగ్లాదేశ్ నావికాదళాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాలు 4వ ఎడిషన్ బొంగో సాగర్ - 23, రెండు నావికాదళాల సమన్వయ గస్తీ కార్పాట్ 5వ ఎడిషన్ విన్యాసాలు ఉత్తర బంగాళాఖాతంలో గురువారంతో ముగిశాయి. ఇవి ఈ నెల 7న ప్రారంభమైనట్టు నేవీ తెలిపింది. విన్యాసాల్లో భాగంగా అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ (ఐఎంబిఎల్) వెంబడి రెండు నౌకాదళాలకు చెందిన నౌకలు, విమానాలు సంయుక్తంగా గస్తీ నిర్వహించాయి. భారత నౌకాదళానికి చెందిన కుథర్, కిల్తాన్, మారిటైమ్ పెట్రోలింగ్ ఎయిర్ క్రాఫ్ట్ (ఎంపిఎ) డోర్నియర్‌తో పాటు బంగ్లాదేశ్ నౌకాదళ నౌకలు అబూబకర్, అబూ ఉబైదా, ఎంపిఎ ఈ విన్యాసాల్లో పాల్గొన్నాయి. అంతేకాకుండా ఈ నౌకలు కమ్యూనికేషన్ విన్యాసాలు, ఉపరితల తుపాకీ కాల్పులు, వ్యూహాత్మక విన్యాసాలు చేపట్టాయి.

పలు రైళ్ల దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లు సాధారణ మార్గమైన నిడదవోలు - ఏలూరు - విజయవాడ బదులు నిడదవోలు - భీమవరం టౌన్ - గుడివాడ - విజయవాడ మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తాయని అధికారులు తెలిపారు. 13351 ధన్‌బాద్ - అలప్పుజా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పాత అనుమతులతో కొత్త పైపులైన్ ?

ప్రతిపాదనల ప్రకారం వచ్చిన అనుమతులతో ప్రస్తుత పైపులైన్ వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో వేసి, తొలగించిన రెండో పైపులైన్ ఎటువంటి అనుమతుల్లేకుండా ప్రభుత్వ, అటవీ భూములు గుండా వేసినట్లు సంబంధిత శాఖలు ప్రాథమికంగా ధ్రువీకరించాయి. అయితే ప్రస్తుతం వేస్తున్న పైప్‌లైన్ అలైన్‌మెంట్ ప్రయివేటు భూముల గుండా ఉన్నట్టు యాజమాన్యం ప్రచారం చేసి ప్రభుత్వ, అటవీ శాఖ భూముల గుండా సముద్రంలోకి వేస్తున్నట్లు సమాచారం. సిపిఎం ఫిర్యాదుతో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పైపులైన్ నిర్మాణ ప్రదేశంలోని భూముల పరిశీలనకు కమిటీని నియమించినా, అదింకా నివేదిక ఇవ్వలేదు. పైపులైన్ నిర్మాణ స్థల సమాచారం లేదని రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన పూర్తిస్థాయిలో చేయకుండానే చేతులెత్తేశారు. అటవీ శాఖ అధికారులు సమాచారం లేదని మౌనందాల్చారు. హెటిరో కంపెనీ డిశ్చార్జ్ పాయింట్ నుంచి సముద్రం లోపలకు వేసే పైప్‌లైన్ పొడవు 4.3 కిలోమీటర్లలో.. 2.3 కిలోమీటర్లు భూమిలో కాగా, మరో రెండు కిలోమీటర్లు సముద్రం లోపల వేయాల్సివుంది. 2.3 కిలోమీటర్లలో ఎన్.నర్సాపురం, సిహెచ్.లక్ష్మీపురం, రాజయ్యపేట. పెదతీనార్లలో ప్రభుత్వ, అటవీ శాఖ భూములున్నట్లు తెలుస్తోంది. హెటిరో పైప్‌లైన్ నిర్మాణంలోని ఉల్లంఘనలు ప్రభుత్వ యంత్రాంగానికి తెలిసినా హెటిరో గ్రూపు ఛైర్మన్ పార్థసారథిరెడ్డి టిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కావడంతో ప్రభుత్వం నుంచి తెస్తున్న ఒత్తిళ్లతో ఏమీ చేయలేక అధికారులు అచేతన స్థితిలో వున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

వామపక్షాల నిరసనలు

అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు బొట్టా ఈశ్వరమ్మ, ఎమ్‌డి.భేగం, ఎం.సుబ్బారావు, సిఎన్.క్షేత్రపాల్, దేవా, జిఎస్‌జె.అచ్యుతరావు, వాసుదేవరావు, యుఎస్ఎన్.రాజు, ఎస్‌కె.రెహ్మాన్, పి.మణి, కె.వనజాక్షి, కె.పెంటారావు, కె.సత్యాంజనేయ, వి.కృష్ణారావు, ఎం.మన్మథరావు, వై.రాజు, ఎ.దేవుడమ్మ, కె.కుమారి, ఎ.పుష్పలత పాల్గొన్నారు.

అనకాపల్లి : పాలస్తీనాలో భాగమైన గాజా ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న జాతి నిర్మూలనా దాడులను ఖండించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో నెహ్రూ చౌక్ జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు మాట్లాడారు. ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు సాధారణ పౌరులు 12 వేల మంది చనిపోయారని, అందులో పసి పిల్లలు నాలుగు వేలకు పైగా ఉన్నారని తెలిపారు. జాతి నిర్మూలన హత్యాకాండను సిపిఎం సీనియర్ నాయకులు బాలకృష్ణ తీవ్రంగా ఖండించారు. భారత విదేశాంగ విధానాన్ని మోడీ సర్కారు విడిచిపెట్టి ఇజ్రాయిల్, అమెరికాలను బలపరచే విధంగా వ్యవహరించడం దారుణమన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సన్యాసిరావు మాస్టరు, రాజాన దొరబాబు మాట్లాడుతూ పాలస్తీనా ప్రజల స్వతంత్ర పోరాటానికి తాము సంఘీభావం ప్రకటిస్తున్నామన్నారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ ఎలా రెచ్చిపోతోందో తెలియజెప్పారు. సిపిఐ ఎంఎల్ పార్టీ జిల్లా కన్వీనర్ పిఎస్.అజయ్ కుమార్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని గౌరవించి ఇజ్రాయిల్ తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు గంటా శ్రీరామ్, అల్లు రాజు, రెడ్డి అప్పలరాజు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

బొకారో ఎక్స్‌ప్రెస్ నవంబర్ 13 నుంచి 17 వరకు, 22837 హటియా – ఎర్నాకులం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 13న, 12835 హతియా – ఎస్ఎంవి బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 14న, 12376 జసిదిహ్ – తాంబరం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 15న, 18111 టాటా – యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 16న, 12889 టాటా – ఎస్ఎంవి బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, నవంబర్ 17న మళ్లించిన మార్గంలో నడుస్తాయి. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి అభ్యర్థించారు.



ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతిపత్రం అందజేస్తున్న భూ బాధిత మహిళలు

భూ బాధితులకు ఇళ్లు కేటాయించాలని వినతి

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం గ్రామాల్లో భూములు కోల్పోయిన బాధిత రైతులకు వెంటనే ఇళ్లు కేటాయించాలని కోరుతూ బాధిత కుటుంబాలతో కలిసి సీతమ్మధారలోగల భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటి వద్ద సిపిఎం నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, డి.అప్పలరాజు వినతిపత్రం అందజేశారు. భూములు కోల్పోయిన, దళిత, వెనుకబడిన తరగతుల పేదలకు ఇస్తామన్న ఇళ్లను నేటికీ ఇవ్వలేదని తెలిపారు. ఎమ్మెల్యే సమస్యపై సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం నాయకులు, ఎస్.పైడితల్లి, నాగరాజు, బంగారమ్మ, అక్కమ్మ, అప్పలరాజు, పోతురాజు, సత్యనారాయణ, బంగారితో పాటు భూ బాధితులు పాల్గొన్నారు.

విశాఖకు మరింత ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : భవిష్యత్తులో మరొక సిలికాన్ వ్యాలీగా ముంబయి నగరానికి ధీటుగా విశాఖ నగరం అభివృద్ధి కానుందని ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి అన్నారు. మేధావుల చర్చ మార్పునకు నాందిగా నిలుస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో విశాఖపట్నం జిల్లా – ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా సమానంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు జిల్లాల వారీగా తాము చేయబోయే ప్రగతిని తమ మ్యానిఫెస్టోలో పొందుపరచాలన్నారు. వీటిపై మేధో చర్చ జరిపి విశ్లేషణలు చేయాలని సూచించారు. ఎయు ఆర్థిక శాస్త్ర విశ్రాంతి ఆచార్యులు కె.శ్రీరామమూర్తి మాట్లాడుతూ సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతి కలిసి సాగాలని సూచించారు. ప్రజలను సామర్థ్యవంతులుగా తీర్చిదిద్దడమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ విసి హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ అభివృద్ధిపై విద్యావంతులు అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని చెప్పారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో ఉండే వనరులు, అవకాశాలు, అడ్డంకులపై విస్తృతంగా చర్చించాలని చెప్పారు. కార్యక్రమంలో ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్, రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ మణిరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎయు విసి ప్రసాద్‌రెడ్డి

వైసిపి పాలన అంతం కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి – కలెక్టరేట్, భీమునిపట్నం : వైసిపి పాలన అంతం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. స్థానిక విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని తరగతుల ప్రజల నుంచీ ఛీత్కారాలను ఎదుర్కొంటున్న సమయంలో మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఎందుకు కాకూడదు అంటూ ఒక కొత్త కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతున్నారన్నారు. 30 వేల మంది మహిళలు అదృశ్యం అయినందుకా ? మద్య నిషేధాన్ని దశలవారీగా అమలు చేస్తామని చెప్పి మాట తప్పినందుకా..? రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రహదారులకు కనీసం మరమ్మతులు చేయనందుకా..? ఒక్క ఉద్యోగం కూడా కల్పించనందుకా..? ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి కావాలా అని ప్రశ్నించారు. వైసిపి సామాజిక బస్సు యాత్రకు ప్రజాస్పందన కరువైందన్నారు. అధికార పార్టీ చేపడుతున్న కార్యక్రమాలలో ప్రభుత్వ అధికారులకు ఏం పని అని ప్రశ్నించారు. భీమిలిలో జరిగిన కార్యక్రమంలోనూ రామ్ మాట్లాడారు. ఆయన వెంట టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఉన్నారు.



మాట్లాడుతున్న బివి.రామ్

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి

ప్రజాశక్తి – కలెక్టరేట్ : స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యనభ్యసించే విద్యార్థుల సేవలు దశ దిశలా విస్తరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. భారత్ స్కౌట్స్, గైడ్స్ జాతీయ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో విద్యార్థులు విశ్వనాథన్, సీతారాంలకు ఆవిర్భావ బ్యాడ్జీలను జేబులకు అతికించి అభినందనలు తెలిపారు. ఈ విభాగంలో ఈ ఏడాది ప్రతిభ కనబరిచిన వారికి వీరిరువురు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ యూత్ కమిటీ ఛైర్‌పర్సన్ ఎం.హరీష్ కుమార్, ఎఎస్ఒసి షరీఫ్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ విశాఖ జిల్లా కన్వీనర్ కె.ఎల్లయ్య, గైడ్ కెప్టెన్ సుజాత పాల్గొన్నారు..

జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరుస్తాం

ప్రజాశక్తి – కలెక్టరేట్ : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు నిబంధనలు సరళతరంగా ఉంటాయని, వారి సొంత ఇంటి కలను ప్రభుత్వం నెరవేర్చనుందని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు జరపాలని నిర్ణయిస్తూ క్యాబినెట్ ఆమోదించిన నేపథ్యంలో విశాఖ అక్రిడేటెడ్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దసపల్లా హోటల్‌లో ఏర్పాటు చేసిన థాంక్స్ గివింగ్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98.9 శాతం నెరవేర్చిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ప్రతి జర్నలిస్టుకూ సొంత ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇటీవల కాలంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే అంశాన్నీ పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం దీపావళి కానుకగా అభివర్ణించారు. అర్బన్, రూరల్ అనే తారతమ్యం లేకుండా జర్నలిస్టులందరికీ సమానంగానే ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎపిఎంఎస్ఎండిసి ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ జివి, విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ గౌరవాధ్యక్షులు కెజి.రాఘవేందర్ రెడ్డి, జి.జనార్ధన్ రావు, అధ్యక్షులు బి.రవికాంత్, గౌరవ సలహాదారులు పి.సత్యనారాయణ, ధవలేశ్వరం రవికుమార్, ఉపాధ్యక్షులు పి.రామకృష్ణ, కొయిలాడ పరుశురాం, దుక్కా మురళీకృష్ణరెడ్డి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

'రవీంద్రభారతి'లో ముందస్తు దీపావళి



రంగులు, పూలతో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని వెల్లంకి రవీంద్రభారతి పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ మంగలక్ష్మి పాల్గొని, దీపావళి పండుగ ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు వివరించి చెప్పారు. ఉత్సవాల సందర్భంగా వివిధ ఆకారాలలో రంగవల్లులు వేసి, రంగులు, పూలతో అలంకరిచారు. మధ్యలో దీపాలను వెలిగించారు. మతాబులు, క్రేకర్, లక్ష్మిబాంబులు వెలిగించి కోలాహలంగా పండుగను జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎజిఎం, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

తాగునీటి సౌకర్యం కల్పనకు చర్యలు

ప్రజాశక్తి -అనందపురం: మండలంలోని పందలపాక పంచాయతీ గంటాపేటలో ఇంటింటికి తాగునీటి సౌకర్యం కల్పన పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో రూ.10లక్షల మండల పరిషత్ నిధులు మంజూరుకాగా, పనులకు శంకుస్థాపన చేసినట్లు వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు,ఎంపిటిసి విజనగిరి అప్పలనాయుడు, మజ్జి రమేష్ నాయుడు, జగ్గారావు, సత్యనారాయణ వైసిపి నేతలు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. క్రైమ్ ఎస్ఐ ఎస్ సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ, ఆటో ప్రయాణికులు కొన్ని సందర్భాల్లో విలువైన వస్తువులు ఆటోలో మర్చిపోతే, వాటిని దగ్గర్లో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు అందజేయాలని కోరారు నేరం చేసేందుకు.ఎవరైనా ఆటోలో ప్రయాణిస్తున్నట్లు అనుమానం కలిగితే, సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. నేరాలను అరికట్టేందుకు అందరూ సహకారం అందించాలని కోరారు

డ్రైడేపై అవగాహన

ప్రజాశక్తి -ములగాడ : 58వ వార్డు పిలకవానిపాలెం కూడలి వద్ద శుక్రవారం జివిఎంసి ఐదోజోన్ మల్కాపురం మలేరియా విభాగం ఆధ్వర్యంలో డ్రైడేఫ్రైడే నిర్వహించారు. మలేరియా ఇన్‌స్పెక్టర్ డి రవికుమార్ పాల్గొని, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఇతర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధులు, జ్వరాలకు కారణమైన దోమల నిర్మూలనకు వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని, ఇంట్లోని పాత్రలు, నీటి ట్యాంకులను రెగ్యులర్‌గా ఖాళీ చేయాలని సూచించారు. దోమలు, వాటి లార్వాల నిర్మూలన ద్వారా వ్యాధులు దరిచేరకుండా ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్, మేస్త్రి పైడితల్లి, మలేరియా సూపర్‌వైజర్లు డి శ్రీనివాసరావు, లలితకుమారి, పి.ఈశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా చేరిన విద్యార్థులు కళాశాలలో ఉన్న వసతులను ఉపయోగించుకొని, విజ్ఞానాన్ని సంపాదించుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల లోగోను, కళాశాల మేగ్‌జైన్‌ను ఆవిష్కరించారు. అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు



లోగో ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్, జాతున్యం

అంగన్వాడీ భవనం ప్రారంభానికి చర్యలు

'ప్రజాశక్తి' కథనానికి ఐసిడిఎస్ అధికారుల స్పందన

ప్రజాశక్తి-పద్మనాభం : నిర్మించినా ప్రారంభానికి నోచుకోక పదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న సొంత భవనంలోని మండలంలోని పెంట అంగన్వాడీ కేంద్రాన్ని ఎట్టకేలకు అధికారులు మార్పు చేశారు. 'ప్రారంభానికి నోచని అంగన్వాడీ భవనం' శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో వెలువడిన కథనంతో సంబంధిత ఐసిడిఎస్ యంత్రాంగంలో కదలిక వచ్చింది. సిడిపిఒ ఎం.శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది శుక్రవారం ఉదయం పెంట చేరుకుని, అంగన్వాడీనూతన భవనాన్ని పరిశీలించారు. ముందుగా భవనం చుట్టూఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, లోపల శుభ్రం చేయించారు. తలుపులు, కిటికీలు, ఇతర మరమ్మతులను రెండురోజుల్లో చేపట్టి, సొంత భవనంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మార్చేందుకు చర్యలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ బోదెల పావని అధికారులకు సహకరించారు. అంగవాడీ కార్యకర్త గొర్లె నారాయణమ్మ పాల్గొన్నారు.



అంగన్వాడీ భవనాన్ని బాగు చేయిస్తున్న సిడిపిఒ, తదితరులు

విశాఖ ఇంజినీరింగ్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు



ఆటాపాటతో అలరిస్తున్న ఫస్టియర్ విద్యార్థులు

ప్రజాశక్తి- పెందుర్తి : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిటిసి ట్రైనింగ్ సొల్యూషన్ ట్రైనర్ ఎ.శివప్రసాద్ జ్యోతి ప్రజ్వళనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంజినీరింగ్ ఫస్టియర్ విద్యార్థులకు సీనియర్స్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య ప్రాముఖ్యత, ప్రపంచవ్యాప్తంగా ఇంజినీరింగ్ రంగంలోవస్తున్న మార్పులను వివరించారు. ప్రిన్సిపల్ డా. వి.శ్రీధర్ పట్నాయక్ మాట్లాడుతూ విద్యతోపాటు అత్యున్నత నైపుణ్యం సాధిస్తే, జీవితంలో ఉన్నతస్థితికి చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఫస్టియర్ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల ఎఒ సుబ్బరాజు హెచ్‌ఒడి ఉదయభాస్కర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశలను వమ్ముచేయొద్దు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయొద్దని నార్త్ సబ్‌డివిజన్ ఎసిపి ఎం శివరామిరెడ్డి విద్యార్థులకు సూచించారు.శుక్రవారం స్థానిక అవంతి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకల్లో మాట్లాడుతూ, సీనియర్లు, జూనియర్లనే తేడా లేకుండా విద్యార్థులంతా స్నేహపూర్వకంగా మెలగాలని హితవు పలికారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు, బైక్‌పై వచ్చేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బైక్ ప్రమాదాల్లో ఈ ఏడాది 300మందికి పైగా మృత్యువాత పడిన విషయాన్ని గుర్తించాలని సూచించారు. చిప్పాడ, దివీస్ జనరల్ మేనేజర్ ఎం సత్యనారాయణరావు మాట్లాడుతూ, విద్యార్థులు ఎంచుకున్న రంగంలో నైపుణ్యం పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు అవంతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్రశేఖర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు



మాట్లాడుతున్న ఎసిపి శివరామి రెడ్డి

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి- తెనుగుపూడి రోడ్‌లో గురువారం రాత్రి ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయపడిన మారేపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పంపాన రమేష్ (32), విశాఖ కెజిహెచ్‌సిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... తెనుగుపూడికి చెందిన బయ్యవరపు బాలాజీ, అర్జున, పోతురాజు, మారేపల్లికి చెందిన ఆటో డ్రైవర్ పంపాన రమేష్ ఆటోలో దేవరాపల్లి నుంచి తెనుగుపూడికి గురువారం రాత్రి 10 గంటలకు బయలుదేరారు. మార్గం మధ్యలో కొల్లివారి కళాలు దాటిన తర్వాత మలుపులో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పొలాల్లోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రమేష్‌కి తీవ్ర గాయాలు కాగా, 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. తెనుగుపూడి గ్రామానికి చెందిన ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని సీఐ తాతారావు, ఎస్సై డి నాగేంద్ర పరిశీలించారు.

మృతుడు బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి ఏడాది క్రితం జ్యోతితో వివాహం జరిగింది. మారేపల్లి నుంచి విశాఖకు ఆటో నడుపుతూ భార్య, తన తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుకునే లోపే ఈ ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోవడంతో మృతుడు పంపాన రమేష్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహారాణి పార్లర్ వద్ద నివాసముంటున్న వల్లి రాంబాబు (40) అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడినటుల సిఐ ఎస్.విజయకుమార్ తెలిపారు. మృతికి కారణాలు, ఇతర వివరాల కోసం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తికి పాతికేళ్ల జైలు

- రూ.ఐదు వేలు జరిమానా: పోక్సో కోర్టు తీర్పు

- బాధిత బాలికకు రూ.ఐదు లక్షల పరిహారం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : మూడేళ్ల బాలిక పట్ల అతి కిరాతకంగా ప్రవర్తించి, ఆమెను శారీరకంగా హింసించిన వ్యక్తికి 25ఏళ్ల జైలు శిక్ష, రూ.ఐదువేలు జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో నేరాల ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జి ఆనందిని శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. అలాగే బాధిత బాలికకు ప్రభుత్వం రూ.ఐదు లక్షలు పరిహారంగా ఇవ్వాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసెక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలివి.

విశాఖ ఉక్కు నగరంలోని ఐఎస్‌ఎఫ్ పోలీస్ విభాగంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న నిందితుడు రాజేష్ కుమార్, బాధితురాలి పక్క క్వార్టర్స్‌లోనే నివాసముంటున్నాడు. గత జనవరి 13న భోగి పండగ జరుగుతున్న సమయంలో బాధిత చిన్నారి రాత్రి 8.30గంటల సమయంలో ఆ వేడుకలు చూడడానికి పక్కింటికి వెళ్ళింది. నిందితుడు ఆమెను తన ఇంటిలోకి తీసుకువెళ్లి అతి క్రూరంగా ప్రవర్తించాడు. గంటపాటు బాలిక కనిపించక పోవడంతో తల్లిదండ్రులు భయపడి చుట్టుపక్కల వెతికారు, చిన్నారి పక్కింటించి బయటికి వస్తూ జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించింది. రాత్రి 10 గంటల సమయంలో బాలిక తల్లి మేకల కుమారి ఉక్కునగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి దిశా పోలీస్ స్టేషన్ అధికారి వివేకానంద నిందితునిపై ఐపిసి సెక్షన్ 376ఎ,బి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. కేసు తీవ్రతను బట్టి డిసిపి జి నాగన్న, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. నేరం జరిగిన. పది నెలల్లోనే కేసు విచారణ పూర్తిచేసి తీర్పునిచ్చారు

కొనసాగుతోన్న పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి- పద్మనాభం :మండల కేంద్రంలోని కుంతీమాధవస్వామి అలయంలో పవిత్రోత్సవాలు మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి ఆటోలు, బస్సులు, ఇతరత్రా రవాణా మార్గాల్లో అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి కుంతీమాధవస్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఆలయానికి సమీపాన ఉన్న దుకాణాల్లో కొబ్బరికాయలు, అరటిపండ్లు, ఇతర పూజాసామగ్రి కొనుగోలు చేసే భక్తులతోసందడి నెలకొంది. ఉత్సవాల్లో ఆలయ ఇఒ నానాజీబాబు, ఎంపిపి కె రాంబాబు, సర్పంచ్ పాప, ఎంపిటిసి కె లక్ష్మి, పద్దు, సన్నిబాబు,పైడిరాజు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సిపి



భీమిలి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సిపి రవిశంకర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ రవిశంకర్ శుక్రవారం సందర్శించారు. ఫిర్యాదుదారులతో, పోలీసులు ఏవిధంగా ప్రవర్తిస్తున్నదీ? ఫిర్యాదులను పరిష్కరించే విధానంపై ఆరా తీశారు. ఫిర్యాదుదారుల సమస్యలపై పారదర్శకంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సిఐ, ఎస్ఐలకు సూచించారు. క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన వాహనాలు పాడవ్వకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను సందర్శించి, సిబ్బంది పనితీరుపై సమీక్ష చేశారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. విహార యాత్రలకు వచ్చే వారు తగిన జాగ్రత్తలు పాటించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ శాండ్ పెట్రోలింగ్ ద్వారా తీర ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. సిపితో పాటుఎసిపి (ఎస్‌బి), సిఐ రమేష్, ఎస్ఐలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : 53వ వార్డు పార్వతీనగర్, గ్రీన్ గార్డెన్స్, శ్రీరామ్ నగర్, శివనగర్, ఆంధ్ర కేసరినగర్, జాకీర్ హుస్సేన్ నగర్, ఎఫ్‌సిఐ నగర్, నరేంద్ర నగర్‌లలో రూ.3.43కోట్లతో బిటి రోడ్లు, సిసి రోడ్లు, సిసి డ్రైనేజీ నిర్మాణాలకు గ్రీన్ గార్డెన్స్‌లో స్థానిక కార్పొరేటర్ బర్కత్ అలీ నగర మేయర్ హరివెంకటకుమారి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో 53వ వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, ఇఇ మచ్చిరాజు,డిఇఇ భరణి, ఎఇఇ రత్నాకర్, మండల ఇన్‌చార్జిలు కృష్ణారావు, అమర్ రెడ్డి నాయకులు షేక్ బాబ్జి, సదరం జ్ఞానేశ్ పాల్గొన్నారు.

49వ వార్డులో ...

మాధవధార: 49వవార్డు మురళీనగర్, అయ్యప్పనగర్, పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లో రూ.2.16కోట్లతో బిటి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు మురళీనగర్, ప్రశాంతి పార్కు వద్ద జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో నగర మేయర్ హరివెంకట కుమారి, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె. రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, స్థానిక నేతలు జి.వెంకటరావు, సి.హెచ్ శ్రీను, అంజనాదేవి, యం.హరి, ఢిల్లీ రావు, చంద్రశేఖర్, షేక్ రెహ్మాన్, సుధాకర్, చైతన్య,సరస్వతి, ఆదిరెడ్డి శ్రీను, చంద్రమౌళి, శకుంతల, మంగ, అచ్యుతవేణి, శ్యామల, మున్నా, అప్పలనాయుడు, జె.వెంకటరావు, శంకర్, సిఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, కర్రి రామారెడ్డి, సబ్బవరపు శ్రీను, ఎవిఎన్ రాజు, కె.చిన్న పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -పిఎం పాలెం: ఎపిఇపిడిసిఎల్ మూడో జోన్ ఆపరేషనల్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు 11కెవి పెప్సీ ఫీడర్ మరమత్తుల దృష్ట్యా ఈనెల 11న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పిఎం పాలెం సబ్‌స్టేషన్ ఎఇఇ మండల అప్పలనాయుడు ప్రకటనలో తెలిపారు. 45వ సచివాలయం పరిధిలోని బాబానగర్, విజేత సూపర్ మార్కెట్, కార్‌షెడ్ ఏరియా తదితర ప్రాంతాలలో శనివారంఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నిర్వహణలో నిర్లక్ష్యం!

నిరుపయోగంగా జివిఎంసి కల్యాణ మండపం

అధ్వానంగా పరిసరాలు.. నిండా పిచ్చిమొక్కలు

అసాంఘిక చర్యలకు నెలవుగా మారడంపై ఆవేదన



వినియోగం లో లేని జివిఎంసి కల్యాణ మండపం

ప్రజాశక్తి - భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలోని మహాత్మాగాంధీ కల్యాణమండపం నిరుపయోగంగా ఉంది. ప్రస్తుతం జివిఎంసి నిర్వహణలో ఉన్న ఈ కల్యాణమండపం ఆవరణ



కల్యాణమండపం ఆవరణలో ఏపుగాపెరిగిన పిచ్చిమొక్కలు

అపరిశుభ్రంగా ఉంది. ఆవరణంతా మల, మూత్ర విసర్జనతో కంపు కొడుతోంది. చుట్టూరా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి, భీతావహంగా ఉంది. 1996లో ప్రభుత్వ నిధులు రూ.40లక్షలు ఖర్చు చేసి దీన్ని నిర్మించారు. ప్రజాధనంతో కల్యాణ మండపం నేడు ఉపయోగంలో లేకుండా పోవడంపై పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని బాగోగులు పట్టించుకునే దిక్కు లేకపోవడంతో మందబాబులకు అడ్డాగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. పేదలు, సామాన్య ప్రజల శుభకార్యాలకు వీలుగా జివిఎంసి నిర్వహణలో ఉన్న కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు

స్టీల్ మార్కెటింగ్‌ను కొత్త పుంతలు తొక్కించాలి

ఉక్కు డైరెక్టర్ కమర్షియల్‌కు సిఐటియు అభినందన

ప్రజాశక్తి- ఉక్కునగరం : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసి డైరెక్టర్(కమర్షియల్)గా ఉద్యోగోన్నతి సాధించిన జివిఎన్ ప్రసాద్‌ను వారి కార్యాలయంలో స్టీల్ సిఐటియు కార్యవర్గం కలసి అభినందించారు. ఈ సందర్భంగా స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం, ప్రభుత్వం అనుసరిరస్తున్న మార్కెటింగ్ విధానాలతో స్టీల్‌ప్లాంట్ నేడు అత్యంత కష్టకాలంలో ఉందన్నారు. దీనిని అధిగమించి స్టీల్ మార్కెట్లోలో విశాఖ ఉక్కుకు ఉన్న మంచి పేరును మరింత ఇనుమడించే విధంగా మార్కెటింగ్ విధానాలను కొత్త పుంతలు తొక్కించాలని కోరారు. దీనికి స్టీల్ సిఐటియుగా పూర్తి మద్దతును అందిస్తామని, ఆ దిశగా ఆలోచనలను పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి



ప్రసాద్‌ను అభినందిస్తున్న సిఐటియు నేతలు

యురామస్వామి, స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, కార్యదర్శవర్గ సభ్యులు పి శ్రీనివాసరాజు, గంగాధర్, యు వెంకటేశ్వర్లు, టివికె రాజు, కెవి సత్యనారాయణ, కృష్ణమూర్తి, మరిడయ్య, కార్యవర్గ సభ్యులు కెఆర్‌కె. రాజు, పవన్ పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన అమెజాన్ బృందం



విద్యార్థినులతో మాట్లాడుతున్న అమెజాన్ బృందసభ్యులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని నేలతేరు కస్తూర్బా గాంధీ పాఠశాలను అమెజాన్ కేంద్ర కమిటీ బృందం శుక్రవారం సందర్శించింది. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తున్న వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి (ఇఎండిపి) కార్యక్రమం 9వతరగతి విద్యార్థులకు ఎంతవరకు ఉపయోగకరంగా ఉందో పరిశీలించారు. దీని ద్వారా విద్యార్థుల ఆలోచన విధానంలో వచ్చిన మార్పులు, పెంపొందిన సామర్థ్యాలు అంచన వేయడానికి జిల్లాలో పర్యటిస్తున్న అమెజాన్ కేంద్రబృందం విద్యార్థులతో మమేకమై, కార్యక్రమానికి సంబంధించి పలుప్రశ్నలు వేసి తెలుసుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మక కృత్యాలు, ప్రాజెక్ట్‌లు తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అమెజాన్ కేంద్ర బృంద సభ్యురాలుసారా హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభకు కొదవ లేదని, ప్రతిఒక్కరూ ఒక వ్యవస్థాపకుడిలా రూపాంతరం చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఎస్ఆర్ సభ్యులు, జొన్నలగడ్డ జయవర్ధన్ లీడ్ ఎపి సభ్యులు చాగంటి బ్రహ్మం, ఆపరేషన్స్ ఎపి జోనల్ మేనేజర్ అగ్నిహోత్ర శర్మ ఓరుగంటి, కాకర నరేష్, ఇఎండిపి జిల్లా మేనేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు వైద్య ఉద్యోగులకు

దీపావళికైనా అందని వేతనాలు

ప్రజాశక్తి- విశాఖపట్నం : నేషనల్ హెల్త్ మిషన్, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు అక్టోబర్ నెల జీతం పదవ తేదీ వచ్చినా అందలేదని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గోపి, కార్యదర్శి వీరబ్రహ్మం ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి పండగకు పస్తులతో ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రతి నెలా ఒకటి,రెండు తేదీల్లో అందాల్సిన వేతనాలు ఇలా ఆలస్యం కావడం వల్ల ఇఎంఐలకు ఫెనాల్టీ పడడం,ఇంటి అద్దెలు చెల్లింపునకు ఇబ్బందులు, ఇతరత్రా సమస్యలు తప్పడం లేదని వాపోతున్నారు. అసలే అరకొర వేతనాలు, వాటినీ ఆలస్యంగా చెల్లిస్తే కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబపోషణ ఎలా సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.. రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు ఉద్యోగులు 22 వేల మంది, ఉమ్మడి విశాఖలో దాదాపు 1500మందికి పైగా పనిచేస్తున్నారని, వారికి అక్టోబర్ నెల వేతనాలు ఇప్పటికీ అందకపోవడంతో దీపావళి పండగ జరుపుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు పద్ధతిన టీబీ, ఆప్తాలమిక్, ఇతర విభాగాల్లో యుపిహెచ్‌సి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా ఒకటో తేదీనే వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవీణ్ సత్తా



రజత పతకంలో ప్రవీణ్

ప్రజాశక్తి - **ఆనందపురం:** 37వ నేషనల్ గేమ్స్ స్కై మార్షల్ ఆర్ట్స్ 50 కేజీల విభాగంలో పోతిన ప్రవీణ్ రజత పతకం సాధించారని స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా వైస్‌ప్రెసిడెంట్, శొంఠ్యాం గ్రామానికి చెందిన బొద్దపు బంగారురాజు తెలిపారు. గతనెల 28 నుంచి ఈనెల 8 వరకు గోవాలో నిర్వహించిన నేషనల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి 16 మంది క్రీడాకారులు ఎంపిక కాగా, జిల్లా నుంచి ఎంపికైన ప్రవీణ్ గోవాలో విశాఖ పతాకాన్ని రెపరెపలాడించారని జిల్లా స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సెక్రెటరీ, కోచ్ లెంక అప్పలరాము తెలిపారు.

ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో నేషనల్ గేమ్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించిన కోచ్ అప్పల రాము, ప్రోత్సాహించిన స్కైమార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు ఆబోతు అప్పలరాము, టీం మేనేజర్ గవర ఈశ్వరరావు గొల్జాన రవికుమార్, రౌతు శ్రీను, గుర్ల విజయ్‌కుమార్, కాకర సురేష్‌కుమార్,బొద్దపు సంతోష్, జోగా ధనుష్, రాజు, సియ్యాద్రి అప్పారావు, అక్కిరెడ్డి దేముడుబాబు, లెంక మధు, రొంగళి వెంకటేశ్వరరావు (వెంకట్)లకు ధన్యవాదాలు తెలిపాడు. పతకాన్ని సాధించిన ప్రవీణ్‌ను శొంఠ్యాం గ్రామస్తులు అభినందించారు

చెకుముకి సైన్స్ పోటీలకు స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -**ఆనందపురం:** జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా శుక్రవారం ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి పోటీలను నిర్వహించారు. 8,9,10వ తరగతుల విద్యార్థులు దాదాపు 300మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి పోటీ పరీక్షలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జెవివి మండల కన్వీనర్ పెద్దింటి శ్రీనాథరావు మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులు 30న జరగబోవు మండల స్థాయి. చెకుముకి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

మాడుగుల: పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలకు పోటీకి విశేష స్పందన వచ్చింది. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు తాళపురెడ్డి ప్రశ్న పత్రాలను ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. నియోజకవర్గంలో 19 పాఠశాలలలో 1352 మంది విద్యార్థులు చెకుముకి సైన్స్ పోటీల్లో పాల్గొన్నారు. గణితఉపాధ్యాయుడు వివిఎన్‌బి.దేవవర్మ పరిశీలకుడుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పల బత్తుల ప్రసాద్, కొండలరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి గౌరీ పట్టుపు మహేష్ పాల్గొన్నారు.

యస్.రాయవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కెజిబివిలో చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించామని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి, మండల కన్వీనర్ కొలగాని వరప్రసాద్ తెలిపారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒలు ఎ. అప్పారావు, మూర్తి ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు.

అచ్యుతాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలం పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి పోటీల్లో వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారు. అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీపాద రవి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. పాఠశాల స్థాయి పరీక్షలను విజయవంతంగా నిర్వహించ డానికి సహకరించిన పాఠశాలల హెచ్‌ఎంలకు, సిబ్బందికి జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు, బొడ్డేడ రామ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రాంబిల్లి : పాఠశాల విద్యార్థులలో పోటీ తత్వం, శాస్త్రీయ అవగాహన, సైన్స్ పట్ల ఆసక్తి పెరగడానికి జన విజ్ఞాన వేదిక చెకుముకి పరీక్ష ఎంతో దోహదం చేస్తుందని రాంబిల్లి కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపల్ జి ప్రమీల తెలిపారు. శుక్రవారం నిర్వహించిన చెకుముకి పోటీల్లో కెజిబివిలో 55 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

గోడ కడితే ఉపాధి పనులెలా చేసుకోవాలి?

పెద్దకలవలపల్లి బాధితుల ఆందోళనకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని పెద్ద కలవలపల్లి గ్రామంలో ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా జిరాయితీ భూముల్లోంచి డిఆర్డిఒ సంస్థ వారు 8 కిలోమీటర్ల మేర ప్రహరీ నిర్మిస్తే, భవిష్యత్తులో ఆ గ్రామస్తులు ఉపాధి పనులు ఎలా చేసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు ప్రశ్నించారు. పెద్ద కలవలపల్లి గ్రామంలో బాధిత కొన్ని రోజులుగా ప్రహరీ నిర్మాణ పనులు సమీపంలో టెంటు వేసుకుని నిరసన చేస్తున్న శిబిరాన్ని సిపిఎం నేత దేముడునాయుడు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి తాగునీటి వాటర్ ట్యాంక్, బోర్లు లోపలే ఉన్నాయన్నారు. వర్షాలు పడి పంట పొలాలు ముంపు గురైనప్పుడు, పశువులను ఈ మెట్ట ప్రాంతంలో పెంచుకొని జీవించే వాళ్లని చెప్పారు. ఈ ప్రహరీ వల్ల చిన్న కలవలపల్లి, కేజీ పాలెం గ్రామాలకు, వై.లోవ పొలాలకు వెళ్లడానికి ఉందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయం చూపించకుండా ఈ విధంగా గోడ కడితే ఎలా బతకాలని ప్రశ్నించారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. ఈ సమస్యలపై అనకాపల్లి ఆర్డీవోకు గ్రామ మాజీ ఎంపిటిసి రావి దేవుళ్ళు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి దేముడునాయుడు



షీల్డ్, సర్టిఫికెట్ అందజేస్తున్న డిఇఒ

రాష్ట్రస్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు దిబ్బపాలెం విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ 31వ రాష్ట్ర స్థాయి పోటీలకు అనకాపల్లి మండలం దిబ్బపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఎంపికైంది. కసింకోట డిపిఎన్ హైస్కూల్లో ఈనెల 9న జిల్లాస్థాయి జాతీయ చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో వివిధ మండలాల నుంచి ప్రధాన అంశమైన అండర్స్టాండింగ్ ఎకో సిస్టం ఫర్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్‌పై 75 ప్రాజెక్టులు పోటీపడ్డాయి. వీటిలో రాష్ట్రస్థాయికి ఏడు ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయి. ఇందులో దిబ్బపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సూర్య మండల పంట... రైతుల ఇంట సిరుల పంట ప్రాజెక్టు ఎంపికైంది. ప్రాజెక్ట్ గైడ్గా పాఠశాల సైన్స్ టీచర్ బి.వి లక్ష్మి వ్యవహరించారు. రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టు ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ పీల ఉష అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు పెద్దాడ అచ్చియమ్మ, రామ శంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ వై రామచంద్ర రావు కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.




మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

జగన్‌ను ఎందుకు నమ్మాలి?

ప్రజాశక్తి-అనకాపల్లి : ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకే అన్ని సామాజిక వర్గాలను జగన్ రెడ్డి నమ్మించి నట్టేట ముంచారని, అలాంటి జగన్‌రెడ్డిని మళ్లీ ఎందుకు నమ్మాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ప్రశ్నించారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌ను ఎందుకు నమ్మాలని ఆయన మొఖం మీద చెప్పేస్తున్నారని, ఇది గమనించిన వైసిపి ప్రజాప్రతినిధులు దుమ్మా కొట్టడం వల్ల బస్సు యాత్రకు పిలుపునిచ్చినా ప్రజాదరణ కరువైందని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని వాలంటీర్లు బెదిరించి తీసుకువచ్చినా కనీసం అరగంట కూడా నిలువ లేక వచ్చినవారు వచ్చినట్టే తిరిగి వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు ప్రత్యక్షం అవుతున్నాయని ఎద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్ ఇవ్వనందుకా? విభజన హామీలు కేంద్ర వద్ద తాకట్టు పెట్టినందుకా? రాష్ట్రానికి జీవనాడిగా నిలిచే పోలవరం ప్రాజెక్టును నాలుగున్నర సంవత్సరాలలో పైసా కూడా ఖర్చు చేయనందుకా, కేంద్రాన్ని కనీసం నిధుల కోసం గట్టిగా నిలదీయకుండా, సిపిఎస్ రద్దు విషయంలో మాట తప్పినందుకా? 9 సార్లు కరెంటు చార్జీలు పెంచి వారి నడ్డి విరిచినందుకా? దేనికి మళ్లీ జగనే కావాలి అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పార్లమెంటు కమిటీ సభ్యులు అనుబంధ సంస్థల సభ్యులు మల్ల శివన్నారాయణ, సాలాపు నాయుడు, బొడ్డేడ మురళి, విల్లూరి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఎంవిఆర్ తీర్థ యాత్రలు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఆధ్వర్యంలో ఉచిత నిత్య తీర్థ యాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఎలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం మూల పేట పంచాయితీ పరిధికి చెందిన గంగదేవి పేట గ్రామానికి చెందిన భక్తులతో ట్రస్ట్ వాహనం బయలుదేరింది. గ్రామ సర్పంచ్ మొల్లేటి చంద్రరావు సమక్షంలో గ్రామ మహిళలు ఈ యాత్రకు బయలు దేరారు. ఈ సందర్భంగా ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)కు శాలువా కప్పి సర్పంచ్ ఘనంగా సత్కరించారు. సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి తదితర ఆలయాల దర్శనములకు భక్తులను సకల సౌకర్యాలతో ఉచితంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయడం పట్ల అభినందన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.



ముత్యాల వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న దృశ్యం

పశువుల ఆసుపత్రికి మరమ్మతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవిఎంసీ విలీనగ్రామం కొండకొప్పాకలో శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలకు వైసీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఇటీవల ఆయన గ్రామాన్ని సందర్శించి శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాలను సందర్శించారు. పశువైద్యాలయ భవనం, గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయనే విషయాన్ని గమనించారు. భవనం చుట్టూ ఉన్న గోడలు పెద్ద పెద్ద రంధ్రాలు ఏర్పడడంతో భవనంలోకి పాములు, ఇతర క్రిమికీటకాలు చొరబడడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్న విషయాన్ని గుర్తించారు. భవనం శ్లాబ్ పూర్తిగా ధ్వంసం కావడంతో శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయని, దీంతో భవనంలో ఉండడానికి భయాందోళనకు గురవుతున్నామని పశువైద్యశాల సిబ్బంది రత్నాకర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన తన సొంత నిధులు వెచ్చించి గోడలకు ప్లాస్టింగులు, భవనం లోపల శ్లాబ్‌కు ఇతర మరమ్మతులను తక్షణమే చేయించారు. దీంతో సిబ్బంది, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు, లైట్లు లేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులను గమనించి రత్నాకర్ తన సొంత నిధులతో కేంద్రంలో రెండు సీలింగ్ ఫ్యాన్లు, రెండు ట్యూబ్‌లైట్లను ఏర్పాటు చేయించారు. మాజీ ఎంపిటిసి వామాల కాశి ఆధ్వర్యంలో పనులను చేయించారు.



శిథిలమైన భవనాన్ని పరిశీలిస్తున్న రత్నాకర్



పైపు ద్వారా దూరం నుంచి నీటిని తెస్తున్న దృశ్యం

అర కిలోమీటర్ దూరం నుంచి వరి పంటకు నీరు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలో సాగునీటి అవకాశం ఉన్న వరి పొలాల్లో సైతం నీరు లేకపోవడం రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దేరు సాగునీటి అవకాశం ఉన్న వడ్డాది, ఎల్బీపురం బంగారం మెట్ట తదితర గ్రామాల్లో సైతం వరి పంటకు నీరు అర కిలోమీటర్ దూరం నుండి పైపుల ద్వారా నీటిని పంట పొలాలకు తరలిస్తున్నారు. మండలంలోని బంగారు మెట్టలో పైపుల ద్వారా నీటిని వరి పంటకు పెట్టారు. రైతుల దైన్యస్థితికి ఇది నిదర్శనం

ఉపాధి హామీపై ప్రజావేదిక



మాట్లాడుతున్న ఎంపిపి రెడ్డి జగన్మోహన్

ప్రజాశక్తి-కె.కోటపాడు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. మస్తర్ల నమోదులో స్వల్పంగా దిద్దుబాట్లు ఉన్నాయని, ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకూడదని అదనపు పీడి రోజారాణి హెచ్చరించారు. గవరపాలెం, ఆర్లి, పోతనవలస, చౌడువాడ ఫీల్డ్ అసిస్టెంట్ల నుండి రూ.2వేలు నుండి రూ.3500 వరకు రికవరీ చేయాలని ఆమె ఆదేశించారు. రికార్డుల నిర్వహణ బాగుందని పీడీ ప్రశంసించారు. ఉపాధి హామీ పథకం 2922-2023 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 32 పంచాయతీలలో ఖర్చుకు సంబంధించి గత నెల 25వ తేదీ నుండి ఈ నెల 9వ తేదీ వరకు 15 రోజులపాటు తనిఖీ నిర్వహించి గుర్తించిన అంశాలను సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించారు. ఎన్ఆర్ఇజిఎస్ 656 పనులకు సంబంధించి రూ.8 కోట్ల 13 లక్షల ఖర్చు, పంచాయతీరాజ్ శాఖ 94 పనులకు సంబంధించి రూ.5 కోట్ల 10 లక్షలు, ఆర్డబ్ల్యూఎస్ మూడు పనులకు రూ.3లక్షల 27వేలు, అటవీశాఖ 11 పనులకు రూ.17 లక్షల ఖర్చును వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, అంబుడ్స్‌మెన్ చిన్నయ్యదొర, ఎంపీడీఓ డాక్టర్ శచీదేవి, ఈవోపీఆర్డి ప్రసాద్, సూర్యనారాయణ, ఏపీవోలు వసంత కుమార్, అప్పలరాజు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలకు సెయింట్ జాన్స్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- కశింకోట : అనకాపల్లిలో భారత్ వికాస పరిషత్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఈనెల 19న రాజమండ్రిలో జరుగు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బత్తుల అనురాధ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎ.శ్రీకృత, జి కుషాల్, టివై నోహిలికా, బి సాయి శశి సింహ, బి గీష్మత, డి గీష్మసాయిశ్రీలను పాఠశాలలో శుక్రవారం అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపానంద్, టి షాజిద, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఇన్నోవేటివ్ ఎంటర్ ప్రెన్యూవర్ షిప్‌పై సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి: స్థానిక డైట్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇన్నోవేటివ్ ఎంటర్ ప్రెన్యూవర్ షిప్ పై డైట్ ఐఇ (ఐ) స్టూడెంట్ చాప్టర్, ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ద్వారా సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు తమ రంగంలో నైపుణ్యం పెంచుకుని తద్వారా తమ సజనాత్మకత తో ఎంట్రప్రెన్యూర్స్ గా తమ భవిష్యత్తును నిర్దేశించుకోవచ్చని రిసోర్స్ పర్సన్ మద్ది గంగాధర్ గుప్తా తెలిపారు. ఎంట్రప్రెన్యూర్ అవ్వాలంటే ఎలాంటి గుణగణాలు ఉండాలి, ఎటువంటి దక్షత ఉండాలి, ఎక్కువ కొత్త తరహాలో ఎలా ఆలోచించాలి అనే విషయాలను సవివరంగా తెలియజేసారు. ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.పార్వతి మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక నైపుణ్యతను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ఏ. దేవి ప్రసాద్ సివిల్ ఇంజనీరింగ్ ఈరోజుల్లో ఉద్యోగం చేయడం గొప్ప కాదని, సృష్టించడమే గొప్ప అని, దానికి కావాల్సిన స్కిల్స్ గురించి మాట్లాడారు. కార్యక్రమంలో డైట్ ఐఇ (ఐ) స్టూడెంట్ చాప్టర్ కన్వీనర్ వై హేమంత్ కుమార్, అసోసియేట్ డీన్ అకాడెమిక్స్ ఏ.కృష్ణనాగ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని సింహాద్రి ఎన్టీపీసీలో డస్ట్ అలవెన్స్ అగ్రిమెంట్ అమలు చేయాలని కోరుతూ టిఎన్టియుసి, బిఎంఎస్, సిఐటియు ఆధ్వర్యంలో ఎన్టిపిసి మెయిన్ గేట్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాసవరపు అప్పలనాయుడు, పైలా సన్యాసినాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ , బిఎంఎస్ నాయకులు బొట్ట రమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ఆర్ నాయుడు మాట్లాడుతూ ఒప్పందం చేసి మూడునెలలైనా నేటికీ అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎన్టిపిసి యాజమాన్యం కార్మిక చట్టాలను కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికులందరికీ ఎన్టిపిసి లోగోతో కూడిన ఐడి కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారు బాబు, ఆలీ, నంబారు రమణ, ఎస్ దేముడు, ఎం శ్రీను, పి గోవిందరాజు, ఎన్ టి పి సి కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు

కొండకర్ల ఆవ అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల ఆవను అభివృద్ధి చేయడానికి పలు ప్రణాళికలు ప్రతిపాదించినట్లు ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు చెప్పారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కొండకర్ల ఆవలో మూడు లక్షల 60వేలు చేప పిల్లలను శుక్రవారం కన్నబాబురాజు చేతుల మీదుగా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆవ గర్భంలో అభివృద్ధి పనులకు 28 కోట్ల రూపాయలు నిధులతో ప్రతిపాదనలు తయారు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, జిల్లా మత్స్యశాఖ అధికారి పి ప్రసాద్, రవితేజ, జడ్పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, వైసీపీ నాయకులు కోన బుజ్జి, కొట్ని శివ, గురునాథ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రిజిస్ట్రార్ గీతా లక్ష్మి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని స్థానిక ఎంపీడీవో ఎస్‌డి శ్యామ్ సుందర్ ప్రారంభించారు. రెడ్ క్రాస్ వైద్య సిబ్బంది సేవలు అందించారు. శిబిరంలో 70 మంది దాతలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సిబ్బంది చైతన్య, సబ్ ట్రెజరీ ఉద్యోగులు, దస్తావేజులరులు పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో నీటి యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24, 25 తేదీలలో వాటర్ మేనేజ్మెంట్, ప్లంబింగ్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్లంబర్లకు రెండు రోజులపాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎస్వి రవికుమార్ తెలిపారు. రెండు రోజులపాటు ఇచ్చే శిక్షణ కార్యక్రమంలో లెర్నింగ్ సర్టిఫికెట్ కోర్సులో ఉచిత శిక్షణ పొందడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. 18 సంవత్సరాల వయసు కలిగిన అర్హులన్నారు. పూర్తి వివరాలకు 9553994510 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించగలరని కోరారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం : వైసిపి బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని స్థానిక ఎమ్మెల్యే కిరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. గురువారం గజపతినగరం గ్రామంలో పార్టీ కార్యకర్తలు నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం చోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద చోడవరం పంచాయతీ పాలకవర్గం, మండలంలో ఉన్న ఆరు పంచాయతీల సర్పంచులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, సర్పంచులు బండి నూకాలమ్మ శ్రీను, నాగులపల్లి రాంబాబు, ఈవో నారాయణరావు, ఒరుగంటి నెహ్రూ, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి

ప్రజాశక్తి- సబ్బవరం : కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆపరేషన్, వైద్యం పొందడానికి ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతిఒక్కరు డౌన్ లోడ్ చేసుకోవాలని స్థానిక ఎంపీడీఓ బి. రమేష్ నాయుడు కోరారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇప్పటికే గ్రామాల్లో రోజులకు పలు పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ యాప్ వల్ల కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య శ్రీ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దీనిపై సచివాలయ ఎఎన్ఎంలతో సమీక్ష నిర్వహించారు.

గొన్న కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఏడుమెట్ల మర్రిపాలెంలో ఉన్న గొన్న కళాశాలలో మై కెరియర్ బిల్డింగ్ ద్వారా తనిస్వి కంపెనీ వారికి క్యాంపస్ ఇంటర్వ్యూ శుక్రవారం నిర్వహించారు. పోస్ట్-సాఫ్ట్వేర్ ఇంజనీర్, బిటెక్, విద్యార్థులు 65 మంది హాజరయ్యారు. కంపెనీ యాజమాన్యం ఇంటర్వ్యూ నిర్వహించి ఐదుగురు విద్యార్థులను షార్ట్ లిస్టు చేశారు. ఈ కార్యక్రమంలో గొన్న కళాశాల సెక్రెటరీ గొన్న హెమ్ చంద్ నాయుడు పాల్గొన్నారు.

డైట్‌లో ఘనంగా దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు డైట్ లిటరరీ కల్చర్ కమిటీ నిర్వహించిన మండలా ఆర్ట్స్, దియా పెయింటింగ్స్ వంటి పోటీలలో అధికసంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా దీపావళి జ్యోతిని కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ వెలిగించి కల్చరల్ ఈవెంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి మట్టి ప్రమిదలను అందజేశారు. ప్రిన్సిపాల్ వైకుంఠ రావు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై బూడి నిర్లక్ష్యం

జిఒ 120కి విలువ లేదా? : సిపిఎం నేత వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

వి.మాడుగుల నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులపై ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటన విమర్శించారు. పెద్దేరు రిజర్వాయర్‌ను ఆధునికీకరించి ఎడమను 84.4 కోట్లతో అభివృద్ధి చేస్తామని, రూ.9.50 కోట్లతో 4ఎల్ఎ కాలువ ద్వారా ఎల్.గంగవరం ఒండ్రువీధి, ఎల్.క్రిష్ణపురం, గదబవీధి, పాతగవరవరం, కాకంకోట, కొండ్లపాడు, కొండవీధి గిరిజన గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన కాలువ పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తామని ఈ ఏడాది మార్చి 16న జిఒ 120ని ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఎనిమిది నెలలు గడిచినా నేటికీ ఎందుకు పనులు ప్రారంభించ లేదని, అసలు ఆ జిఒకు విలువ ఉందా? అని ప్రశ్నించారు. సకాలంలో పనులు జరిగి ఉంటే ఈ సంవత్సరం వర్షాలు సక్రమంగా లేనందున మెయిన్ కెనాల్ ద్వారా రావికమతం మండలంలోని 16 గ్రామాల్లో 4,110,12 ఎకరాలకు సాగునీరు అంది ఉండేదని, అలా చేయక పోవడం వలన ఈ పంట పొలాలు బీడు బారి పోయాయని తెలిపారు. రైవాడ రైతులకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగు నీరు అందిస్తామని నమ్మి బలికి మోసం చేశారన్నారు. నియోజకవర్గంలో రైవాడ, ఇసుక గెడ్డ, పాలగెడ్డ, గొర్రిగెడ్డ, తారకరామ పెద్దేరు ఇలా ఎన్నో ప్రాజెక్టులు మంత్రి నిర్లక్ష్యం కారణంగా ఎటువంటి అభివృద్ధి చెందకుండా ఉండిపోయాయని తెలిపారు.

జాతీయ యోగా పోటీలకు విద్యార్థి ఎంపిక



లయవర్ధన్

ప్రజాశక్తి - యలమంచిలి : ఈ నెల 23 నుండి 27 తేదీ వరకు త్రిపురలోని అగర్తలాలో జరిగే జాతీయ యోగా పోటీలకు 17 ఏళ్ల అండర్ పాఠశాల విభాగంలో స్థానిక కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల 10వ తరగతి విద్యార్థి గొంతిన లయవర్ధన్ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.వి.రమణ శుక్రవారం తెలిపారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో అనకాపల్లి జిల్లాలో నుండి ఉత్తమ ప్రదర్శన కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్. వెంకట్రావు, పేరెంట్స్ కమిటీ సభ్యులు లయవర్ధన్‌ను అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాలపై ప్రచారం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలపై దేవరాపల్లి గ్రంథాలయాధికారి ఓ. శ్రీనివాసరావు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పడాల దాస్‌ని కలిసి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, 16న గ్రంథాలయ ఉద్యమకర్తల సంస్మరణ దినోత్సవం, మ్యూజికల్ చైర్ పోటీలు, 17న వక్తృత్వం పోటీలు, 18న చిత్రలేఖనం పోటీలు, సభ్యత్వ సేకరణ, 19 మహిళా దినోత్సవం, ముగ్గుల పోటీలు, 20న మధ్యాహ్నం 3 గంటలకు విజేతలకు బహుమతుల ప్రదానం, ముగింపు సభ ఉంటుందని, విద్యార్థులందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బుచ్చయ్యపేట : గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని స్థానిక గ్రంథాలయ అధికారి వి.కృష్ణారావు కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ రంగంలో విశేష కృషి చేసిన ప్రముఖుల గురించి వివరించడం, చిత్ర లేఖనం, పద్య పఠనం పోటీలు, 17న దేశభక్తి గేయాలు, సభ్యత్వ నమోదు, 18న వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, ఇందిరాగాంధీకి నివాళి, 19న క్విజ్ పోటీలు, 20న ముగింపు, బహుమతుల ప్రదానం ఉంటుందని చెప్పారు.

నక్కపల్లి : మండలంలో పెదబోదుగల్లం హైస్కూలులో ఈనెల 14 నుండి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సిహెచ్. సత్యనారాయణ తెలిపారు. ఈనెల 14న బాలల దినోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, పుస్తక ప్రదర్శన, గ్రంథాలయోద్యమ నాయకులకు నివాళులు, చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 20న ముగింపు సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

దిబ్బిడిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి సబ్ సెంటర్‌లో బుచ్చయ్యపేట పిహెచ్సి వైద్యాధికారి వెంకటకృష్ణ ఆధ్వర్యాన శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దిబ్బిడి గ్రామంలో వాంతులు విరోచనాలతో పలువురు వివిధ ఆసుపత్రులలో వైద్యం పొందుతున్నారు. అతిసార ఇబ్బందులు పడుతున్న విషయమై పత్రికల్లో కథనాలు శుక్రవారం రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. గ్రామంలోని ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. 22 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నలుగురు రోగులను మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు.

తాగునీరు కలుషితమే కారణమా?

దిబ్బిడిలో అతిసార ప్రబలడానికి గ్రామంలో తాగునీటి నిర్వాహణ సక్రమంగా లేనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఇంటింటికి కులాయి పథకంలో భాగంగా బీసీ కాలనీలో అంగన్వాడీ కేంద్రం సమీపంలో నిర్మించిన మంచినీటి ట్యాంకుకు కొద్దిరోజులుగా సక్రమంగా క్లోరినేషన్ చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా లేదని, మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోవడంతో దోమల అధికంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆయుర్వేద కేంద్రంలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం ఆయుర్వేద కేంద్రంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య అధికారి లావణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, కాలుష్యం నివారణకు మొక్కలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సిహెచ్ శివ యోగా శిక్షకులు ఆర్ శ్రీను, యస్‌వై నాయుడు స్థానికులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో ఈ-పంట ధ్రువీకరణ పత్రాలు

ప్రజాశక్తి -కశింకోట : ఈ పంట నమోదు చేసుకున్న రైతులు ధ్రువీకరణ పత్రాలు రైతు భరోసా కేంద్రం వద్ద తీసుకోవాలని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు మోహనరావు తెలిపారు. కశింకోట మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకానికి అర్హులైన రైతులందరూ జాబితా చూసుకోవాలన్నారు. ఎంపీపీ కలగా లక్ష్మి గున్నయ్య నాయుడు మాట్లాడుతూ బయ్యవరం, చుట్టుపక్కల ప్రాంతాలు వర్షాలు లేక పంట వేయకుండా వదిలేసిన భూములకు కరువు నష్టం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పెంటకోట జ్యోతి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మలసాల కిషోర్, వ్యవసాయ శాఖ అధికారి స్వప్న పాల్గొన్నారు.

పత్రాల అందజేత

సబ్బవరం : మండలంలోని ఖరీఫ్ సీజన్లో ఈ పంట ద్వారా నమోదు చేసి ధ్రువీకరణ పత్రాలను గుల్లేపల్లిలో సర్పంచ్ బండారు మంగ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసిన వివరాల ముసాయిదా జాబితాలను ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందని, దాని తర్వాత సవరణలు తుది జాబితాలను ఇస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామగ్రిని కెనరా బ్యాంక్ సిఎస్ఆర్ నిధులతో పంపిణీ చేసినట్లు ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాధాకుమారి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ రమేష్ నాయుడు చేతుల మీదుగా కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ నుపూర్ చౌదరి అందజేశారు. క్రీడా సామగ్రికి కృషి చేసిన ఎంపీడీఓకి హైస్కూల్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పిడి రెహ్మాన్ పాల్గొన్నారు.

ఘనంగా మైనారిటీ దినోత్సవం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం మౌలానా ఆజాద్ జయంతి సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ జాతీయ మైనారిటీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పి కిరణ్ కుమార్, సీనియర్ అధ్యాపకులు ఐవిబి సత్యవతి, డాక్టర్ సిహెచ్ జ్యోతి, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బిచ్చమ్మ, డి మాల్యాద్రి, డాక్టర్ వి రత్న భారతి మౌలానా ఆజాద్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎం రఫుద్దీన్, వి అప్పలనాయుడు, జి వెంకటేష్ నారాయణమూర్తి, సుధీర్, జి సత్యనారాయణ, డాక్టర్ ఎస్ మల్లి బాబు, సరస్వతి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు అంగీకారం

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట మెయిన్ రోడ్డు విస్తరణ పనులపై సందిగ్ధత తొలగింది. శుక్రవారం మరో సారి ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. దీంతో రోడ్డు సెంటర్ నుంచి ఇరువైపులా సుమారు 30 ఆడుగుల మేర విస్తరణ పనులు చేపట్టేందుకు వ్యాపారులు అంగీకరించారు. రావికమతం, వడ్డాది తరహాలో 60 అడుగుల మేర రోడ్డు విస్తరణకు అంగీకారం తెలపడంతో నోటీసులు జారీకి పంచాయితీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరో మారు మార్కింగ్ పనులు చురుగ్గా కొనసాగాయి. దీపావళి, నాగుల చవితి పండగల అనంతరం విస్తరణ పనులు చేపట్టెందుకు అధికారులు, వ్యాపారులు మధ్య ఒప్పందం కుదిరింది. అందుకు హామీ పత్రం పై ఒక్కర, ఇద్దరు వ్యాపారులు మినహా అందరూ సంతకాలు కూడా చేసి నట్టు గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ చెప్పారు.

తాగు నీటి సమస్య కొలిక్కి

గ్రామంలో 16 వార్డులలో సుమారు 22 వేలకు పైగా జనాభా ఉంది. ఈ జనాభాకు సరిపడా తాగు నీరు సరఫరా లేకపోవడంతో గత కొన్నేళ్లుగా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామంలో తాగు నీటి అవసరాల కోసం చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ సుమారు రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఇప్పటికే ధర్మవరం బిడ్జి వద్ద రక్షత పథకం నిర్మాణంతో పాటు పంపింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఇంటింటికి కొళాయి పైపులైన్ కూడా వేశారు. విద్యుత్ కనెక్షన్ పనులు పూర్తి కావచ్చాయి. స్థానిక ప్రకాష్ నగర్ వెళ్లే రహదారిలో పూర్తి స్థాయిలో తాగు నీరు అందించేందుకు మరో రక్షిత పథకం నిర్మాణం చేశారు. దీని నుంచి ఇంటింటికి తాగు నీరు అందించేందుకు మరో పైప్ లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ పైప్ లైన్ మెయిన్ రోడ్డు వెంబడి వేయాల్సివుంది. ఆది రోడ్డు విస్తరణ అయితే గాని వేసేందుకు వీలుకానీ పరిస్థితి దాపరించింది. తమ తాగు నీటి తిప్పలు తప్పాలంటే రోడ్డు విస్తరణ జరగాలని గ్రామస్తులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు.



కరపత్రాలు ఇస్తున్న టిడిపి శ్రేణులు

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజ య్యపేట గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన టిడిపి శ్రేణులు బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతో మాత్రమే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పిక్కి రాంబాబు, పిక్కి గంగరాజు, పిక్కి శ్రీనివాసరావు, సత్తియ్య, పిక్కి కోదండరావు, అప్పలరాజు ,మడదా రాంబాబు,వాసు, తాతీలు ,కాశీ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం సిటీ క్లబ్ ఆవరణంలో బిఎస్పీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన పరంజ్యోతి మాట్లాడుతూ, రాష్ట్రంలో 85 శాతం ఉన్న బహుజనులు మాత్రం అధికారానికి దూరంగా ఉన్నారన్నారు. బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే బియస్పి ప్రధాన లక్ష్యమన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజల్ని మోసం చేస్తున్నాయని, వాటిని ఇంటికి పంపించే సమయం వచ్చిందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ పార్టీ అభ్యర్థి బొట్టా నాగరాజు మాట్లాడుతూ,ఇప్పటి వరకు ఇక్కడ పాలించిన ఎమ్మెల్యేలంతా భూదందాలు, లంచాలతో నర్సీపట్నం ప్రజల్ని దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ముందుగా సియంఆర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు బొని కృష్ణ, ఇంచార్జ ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు చిన్నరావు పాల్గొన్నారు.




సభకు హాజరైన నాయకులు

కాలుష్య రహిత దీపావళిపై అవగాహన

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలో గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కాలుష్య రహిత దీపావళి పై ప్రధానోపాధ్యాయులు నాగన్నదొర ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టపాసులు కాల్చేటప్పుడు వాయు, శబ్ద కాలుష్యం లేకుండా చూడాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరీ, శ్రీదేవి, సుబ్బలక్ష్మి, భవాని, కమల, పద్మావతి,పీ.డీ. కుందూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఎపికి జగనే ఎందుకు కావాలి'



కోటవురట్లలో హాజరైన నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:చెట్టుపల్లి-1. సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపిపి సుర్ల రాజేశ్వరి మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను సిఎం జగన్ నెరవేర్చారన్నారు. రాజకీయాలు, పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత గల వారందరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జయమాధవి, మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, వైస్ ఎంపిపి ఇన్నం రత్నం, జెఎఎస్ మండల కన్వీనర్ చినాబు, యూత్ అధ్యక్షులు నానాజీ, మహిళ అధ్యక్షురాలు, సచివాలయం కన్వీనర్లు మావూరి రాజారావు, రమణ పాల్గొన్నారు.

కోటవురట్ల: జగనన్న ఎందుకు కావాలి కార్యక్రమం మండలంలో పందూరు శుక్రవారం గ్రామంలో అధికారులు, నాయకులు నిర్వహించారు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, స్థానిక సర్పంచ్ జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల వైసిపి అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పిటిసి సభ్యురాలు ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, వైస్ ఎంపీపీ దత్తుడురాజు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బికేపల్లి ఎంపీటీసీ సభ్యులు రాంబాబు, ఈఓపిఆర్‌డి భానోజిరావు, గ్రామ కార్యదర్శి జోష్ణ, మాజీ సర్పంచ్ నారాయణరావు, వైసిపి నాయకులు, వెంకట్, గృహ సారథులు వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని చీడిగుమ్మల గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం మార్కెట్ కమిటీ జెడ్పిటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణలు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఎంపిటిసి లెక్కల అప్పలనాయుడు, గ్రామ సర్పంచ్ చిన్నబ్బాయి, ఉప సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, కోపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు ఇటంశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : ఎపికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమం మండలంలోని వాకపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వైసిపి జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటిని సందర్శించి మళ్ళీ సీఎంగా జగన్ ఎందుకు కావాలో వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైసిపి నేతలు కిలపర్తి భాస్కరరావు, బూరె బాబురావు, కెవి.రమణ, సూరినాయుడు పాల్గొన్నారు.

ఆరిలోవ : 13వ వార్డు ఆరిలోవ కాలనీ, వెర్ని దుర్గానగర్‌లో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎపికి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో స్మార్ట్ సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు(జివి), వైసిపి తూర్పు ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు పాల్గొని, అభివృద్ధి, సంక్షేమ వివరాలతో బోర్డులను ఆవిష్కరించారు. రామాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు.కార్యక్రమంలో మత్స్యకారం కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, ఫారెస్ట్ డైరెక్టర్ వనం వరలక్ష్మీ, వాణిజ్య విభాగం అధ్యక్షులు వానపల్లి ఈశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు శిరీష పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని ఐనాడ గ్రామంలో నిర్వహించిన ఎపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు ఎపి నీడ్ జగన్ అంటూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతో బోర్డులను గ్రామ సచివాలయంలో అవిష్కరించారు.ఇంటింటికీ వెళ్లి ముద్రిత పుస్తకాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నేతలు మామిడి శివ, కోరాడ రామేశ్వరరావు, బి తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను, బుడ్డివలస సర్పంచ్ సూర్యనారాయణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

గోపాలపట్నం : 92వ వార్డు ఎస్‌సి,బిసికాలనీలో జివిఎంసి కోఆప్షన్ సభ్యుడుబెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ, జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో వైసిపి వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, జి అప్పలస్వామినాయుడు, కంపర సత్తిబాబు, కంపర కోటేశ్వరరావు, నీలాపు శ్రీనివాసరెడ్డి, బల్ల రమణ, కంపర రామకృష్ణ, భీమయ్య, ఎద్దు దేవుళ్ళు, కంపర కనకరాజు, సీరపు రెడ్డి, సాలాపు రమణ, సాలాపు దుర్గాప్రసాద్, సీరపు శంకరరావు, కరణం సింహాచలం, జలగం నాగలక్ష్మి, గోల్కొండ సత్యవతి, బోనెల నాగరత్నం పాల్గొన్నారు.

భీమునిపట్నం :సంక్షేమ పాలన సిఎం జగన్ మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు జివిఎంసి నాలుగో వార్డు జెవి అగ్రహారంలో 'ఎపికి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఘనంగా ధన్వంతరి జయంతి


ప్రజాశక్తి -పాయకరావుపేట: జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా శ్రీ ప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ఆయుర్వేద మూల పురుషుడు ధన్వంతరి జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీ ప్రకాష్ ఆయుష్ చారిటబుల్ రీసెర్చ్ ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సిహెచ్.వి.కె. నరసింహారావు, రామసీత దంపతులు ధన్వంతరి హెూమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేరళలోని పూంతొట్టం ఆయుర్వేదాశ్రమ్ ఫౌండర్, మెడికల్ డైరెక్టర్ పి.ఎమ్.ఎస్ రవీంద్రనాథ్, తమిళనాడు కోయం బత్తూరులోని సాయిగ్రామ్ ఆయుర్వేద హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పి.ఎమ్.ఎస్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రపంచ దేశాలు కూడా ఆయుర్వేదం ఆవశ్యకతను గుర్తించి ఈ వైద్య విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. సన్మాన గ్రహీత ఆలపాటి రాజేంద్రప్రసాద్, ట్రస్ట్ ఫౌండర్ ట్రస్టీ సిహెచ్.వి.కె. నరసింహారావు మాట్లాడుతూ, ఇక్కడ ఆయుర్వేద చికిత్సాలయం స్థాపించి వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సి. హెచ్. విజయ్ ప్రకాష్, సమీరా, దంపతులు, ఆయుర్వేద చికిత్సాలయం ప్రధాన వైద్యులు రమేష్ బాబు పాల్గొన్నారు.

కల్వర్టు పనులు చేపట్టరూ..

ప్రజాశక్తి-రోలుగుంట:మండల కేంద్రంలో ఆర్‌సిఎం చర్చి ఎదురుగా ఉన్న కల్వర్టు పూర్తి చేయాలని ఎంపిటిసి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఈ కల్వర్టులో పడి ఒక వృద్ధురాలు మృతి చెందిందని, ఇటీవల రోలుగుంట గ్రామంలో కల్వర్టు నిర్మించడానికి తవ్విన గోతుల్లో కూడా పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణంలో భాగంగా పాల కేంద్రం వద్ద ఆర్‌సిఎం చర్చి ముందు కల్వర్టు వేసి గొయ్యిలు తవ్వి వాటిని పూడ్చలేదని, దీంతో వృద్ధురాలు మరణించగా ఎంతో మంది పడిపోవడం జరుగుతుందన్నారు. అధికారులు స్పందించి కల్వర్టు కోసం తవ్విన గొయ్యిలను పూర్తి నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

బుచ్చంపేటలో 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి-రోలుగుంట:బుచ్చంపేట గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భం గా ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు గ్రామ సచి వాలయం సంద ర్శించి ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను వివరించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం మళ్లీ వైయస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామన్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



హాజరైన నేతలు



కిట్లును చూపుతున్న విద్యార్థులు

విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్థానిక పాయకరావు పేటలోని శ్రీ చైతన్య పాఠశాలలో స్పేస్ సెటిల్మెంట్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రోత్సాహకంగా నాసా కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. నాసాలో పాల్గొన్న 20 మంది విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాల జీవశాస్త్ర ఆచార్యులు కే.వి.జి.కె.వరప్రసాద్ నాసా కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోటీ ప్రపంచంలో రాణించాలంటే నిబద్ధత, అంకితభావం, నిరంతర సాధన అవసరమన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పి.మాణిక్యాలరావు మాట్లాడుతూ, నాసా పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి పాఠశాలకు జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉత్తరాంధ్ర శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం ఎం.వి.సురేష్, రీజినల్ ఇన్చార్జ పి.గోపినాథ్, అకడమిక్ కోఆర్డినేటర్ ఎన్.వెంకట రమణలు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డీన్ కె.విజయ్, ఇన్చార్జి లోవేష్, నాసా మెంటార్ గణేష్, నాసా ఇన్చార్జి లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయాలి



నక్కపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి: ప్రజా రక్షణ భేరిలో భాగంగా ఈనెల 15న సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. నక్కపల్లిలో పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ,అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లో 18 మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొని వేసిన వరి ఇతర పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అయినప్పటికి జిల్లాలో ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకుండా జిల్లా రైతాంగానికి తీవ్రంగా ద్రోహం చేశారన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను, కూలీలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, ఎం.శివాజీ, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట: ఈ నెల 15న సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు పిలుపునిచ్చారు. రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ, పెద్దగరువు, ఆర్ల, పనసలపాడు, గదబపాలెం గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ, గిరిజన సాగు భూములో గిరిజనేతరులు, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు స్థానిక రెవిన్యూ అధికారులు కుమ్మక్కై గిరిజన సాగు భూముల నుండి వెలుగొట్టే కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.కొండబాబు, ఈరెల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : విజయవాడలో ఈనెల 15వ తేదీన జరుగు ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు మండలంలోని గొండుపాలెం, కె.కోటపాడు గ్రామాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు వత్తాసు పలకడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వనుము సూర్యనారాయణ, పార్టీ సానుభూతిపరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రజా రక్షణ బేరి మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము పిలుపునిచ్చారు. పూడిమడక కుమారపురం గ్రామాలలో శుక్రవారం గ్రూప్ మీటింగ్ నిర్వహించి ప్రచారం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలతో పాటు ప్రతిపక్షాలు ఘోరంగా విఫలం చెందుతున్నాయని పేర్కొన్నారు.

ములగాడ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేస్తున్న అన్యాయంపై, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణభేరి యాత్ర ముగింపుగా ఈనెల15న విజయవాడలో నిర్వహించే బహిరంగసభకు తరలిరావాలని సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం 61వవార్డు మల్కాపురం పల్లివీధి, గొల్లవీధిలలో కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పల్లివీధిలో సిపిఎం మల్కాపురం జోన్ నేత ఆర్.విమల మాట్లాడుతూ, విభజన హామీల అమలు, ఇతరత్రా విషయాల్లో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వైసిపి, టిడిపి, జనసేనలను ప్రజలంతా నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్.ఉమా, మాధురి, అమ్మాయమ్మ, నాగరత్నం, తులసి పాల్గొన్నారు.



దగ్ధమైన పూరిల్లు

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని బంగారమ్మ పేటలో ఎస్.భూలోకమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. గురువారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెల రేగడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి అంతా పూర్తిగా దగ్ధమైందని బాధితురాలు భూలోకమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరింది. సుమారుగా లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.ఈ మేరకు రెవిన్యూ అధికారులు దగ్ధమైన పూరిల్లును పరిశీలించి, సంఘటనపై బాధితురాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో రూ.60లక్షలతో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 20వ వార్డు సీతయ్యపాలెంలో రూ.5లక్షలతో సిసి రోడ్డు, 19వ వార్డు పాతబయపురెడ్డిపాలెం, కొత్తబయపురెడ్డి పాలెంలో 20లక్షలతో సిసి రోడ్డు, డ్రైన్లు, 20వ వార్డు కొత్తబయపురెడ్డి సచివాలయం బలిఘట్టంలో రూ.5లక్షలతో సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 18వ వార్డు బలిఘట్టంలో రూ.12లక్షలతో సిసి రోడ్డు, 17వ వార్డు బలిఘట్టంలో 18లక్షలతో సిసి రోడ్డు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, వైసిపి కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అధికారులు

అటవీ అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి-గొలుగొండ: కృష్ణదేవిపేట అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు డిఆర్ఒ కెవి.రాజేష్, గొలుగొండ ఫారెస్ట్ అధికారి ఆర్.లక్ష్మణ్ నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమర వీరుల త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -యస్.రాయవరం: వేములపూడిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి బేస్ బాల్ విభాగంలో ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు వ్యాయామోపాధ్యాయుడు కె.శ్రీనువాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కె వర్షిణి బేస్ బాల్ అండర్ 14 విభాగంలోనూ, అండర్ 17 విభాగంలో జి వాహినిలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యన్నారాయణ, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలిన ఆకాంక్షించారు.



మెడల్స్ చూపుతున్న విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయపడినట్లు స్థానిక యస్ఐ పి ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం గుర్రాజుపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కుందేటి రమణ కొరుప్రోలు జనసేన జంక్షన్ వద్ద ఆటో నిలిపి, యస్ బి ఐ కౌంటర్ వద్ద పని ముగించుకుని ఆటో వద్దకు వచ్చేందుకు రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో అడ్డురోడ్డు నుండి కొరుప్రోలు వస్తున్న బైకిస్టు గుండ్రోజు రామ మణికంఠ ఆటోడ్రైవర్ సత్తిబాబును ఢీ కొట్టడంతో ఇరువురుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 లో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.ప్రథమ చికిత్సానంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ ప్రసాదరావు తెలిపారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

కుమారపురంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్ నాగాపురం పంచాయతీ శివారు కుమారపురంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు సర్పంచ్ యలమంచిలి రఘురామచంద్రరావు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో ఈ సిసి రోడ్డు నిర్మాణ చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలసుబ్రమణ్యం, వార్డు మెంబర్లు జుర్ర లవకుమార్, జైతు అప్పారావు, గంటల బుచ్చిబాబు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

15న ఎపిటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి: ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటిఎఫ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పునరుద్ధరించాలని, పాఠశాలల మెర్జింగ్ రద్దు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు జీవో 12,24, 40 అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి.శ్రీనివాసరావు, యూనియన్ మండల శాఖ అధ్యక్షులు దాడిశెట్టి కొండలరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ అప్పలరాజు, గౌరవ అధ్యక్షులు వి.కృష్ణ. ఎ.సత్యవతి, రంగబాబు, సురేష్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

- టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు అనిత

ప్రజాశక్తి-యస్.రాయవరం: రైతన్నల సమస్యలపై జనసేనతో కలసి పోరాటం చేస్తామని తెదేపా మహిళా అధ్యక్షురాలు, పొలిట్ బ్యూరో సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం సైతారుపేట గ్రామం నుండి యస్.రాయవరం వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ, కరువుతో అల్లాడుతున్న రైతాంగానికి తెదేపా పార్టీ అండగా ఉంటుందన్నారు. సాగునీరు అందక రైతాంగం అల్లాడుతున్నారని, వరహానదిలో గ్రోయిన్లు శిధిలావస్థకు చేరడంతో పంటలకు నీరందక ఎండిపోతున్నా పట్టించుకునే నాధుడే లేడన్నారు. ఎకరాకు ముప్పై వేల రూపాయలు పెట్టుబడి పెడితే ఇరవై బస్తాలు దిగుబడి రాని పరిస్థితి ఉందన్నారు. చంద్రబాబు హాయాంలో రైతులకు యాభై వేల లోపు తక్షణమే రుణమాఫీ చేయగా, లక్ష దాటిన వారికి దశల వారీగా చేశారని గుర్తు చేశారు. అనంతరం పాదయాత్రగా వచ్చి తహాశీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, పెదిరెడ్డి చిట్టిబాబు, మాజీ ఎంపిపి యేజర్ల వినోద్ రాజు కోన అప్పలరాజు, శంకర్, రవి, రమణ బాబు పాల్గొన్నారు.



పాదయాత్ర చేపడుతున్న అనిత, నాయకులు